నేడు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాల్లో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరిట సోమవారం ఉదయం పది గంటలకు ఏయూ అంబేద్కర్ అసెంబ్లీ హాలులో అవార్డులు ప్రదానం చేయనున్నారు. పదో తరగతిలో 83 మందికి, ఇంటర్మీడియట్‌లో 38 మందికి అవార్డులు అందజేస్తారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి ముఖ్యఅతిథిగా హాజరవుతారని కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు.

ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో

విద్యార్థుల ప్రతిభ



గిరడా లక్ష్మీచరణ్ (అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు)

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు సాధించిన లక్ష్మీ చరణ్

- రాష్ట్ర స్థాయిలో టాప్ వందలో చోటు దక్కించుకున్న పలువురు విద్యార్థులు



గురుకీర్తన (అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో 34వ ర్యాంకు)



దిగుమర్తి గణ సాయిధర్మ ప్రతాప్ (ఇంజనీరింగ్‌లో రాష్ట్ర స్థాయిలో 47వ ర్యాంకు)



వారణాసి లక్ష్మీనారాయణ నిఖిలేశ్ (ఇంజనీరింగ్‌లో 54వ ర్యాంకు)

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీ సెట్-2025 ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షకు జిల్లా నుంచి వేలాది మంది విద్యార్థులు హాజరవ్వగా, తాజాగా వెలువడిన ఫలితాల్లో పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మెరుగైన ర్యాంకులను సాధించి సత్తా చాటారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ఫలితాల్లో చినవాల్తేరుకు చెందిన గిరడా లక్ష్మీచరణ్ 91.31 స్కోరుతో రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంకు సాధించాడు. ఇంజనీరింగ్ ఫలితాల్లో సీతమ్మధార ప్రాంతానికి చెందిన దిగుమర్తి గణ సాయిధర్మ ప్రతాప్ 88.87 స్కోరుతో రాష్ట్ర స్థాయిలో 47వ ర్యాంకు సాధించగా, జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. అలాగే సీతమ్మధారకు చెందిన వారణాసి లక్ష్మీనారాయణ నిఖిలేశ్ 88.43 స్కోరుతో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 54), కొమ్మాది ప్రాంతానికి చెందిన ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం పెద్దిబొట్ల 86.60 స్కోరుతో మూడో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 80) సాధించాడు. అలాగే భీమిలి పరిధిలోని తాళ్లవలసకు చెందిన ఎన్.ఉదయ్‌పవన్ 85.23 స్కోర్‌తో నాలుగో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 104), కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన నెమ్మాది ఆకాశ్ 85.08 స్కోరుతో ఐదో ర్యాంకు (108), సీతమ్మధారకు చెందిన రెబ్బాప్రగడ సత్య శృతీష్ 83.85 స్కోరుతో ఆరు (124), గోపాలపట్నం ప్రాంతానికి చెందిన వంగపండు గీతమ్ కుమార్ నాయుడు 83.48 స్కోరుతో ఏడో ర్యాంకు (131) సాధించారు. అదేవిధంగా కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన నీరుకొండ హిమవెంకట శ్రీకార్తికేయ 83.44 స్కోరుతో ఎనిమిదో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 134), అక్కయ్యపాలేనికి చెందిన వల్లభవాజుల కాశ్యప్ 82.91 స్కోరుతో తొమ్మిది (రాష్ట్ర స్థాయిలో 152), తాళ్లవలసకు చెందిన డీకే జయవర్ధన్ 82.66 స్కోరుతో పదో (రాష్ట్ర స్థాయిలో 158) ర్యాంకు సాధించి సత్తా చాటారు.

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో ర్యాంకర్లు వీరే..

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలోనూ పలువురు విద్యార్థులు మెరుగైన స్కోరు సాధించి సత్తా చూపారు. గాజువాకకు చెందిన గురుకీర్తన 88.31 స్కోర్‌తో రెండో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 34) సాధించగా, పెదగంట్యాడకు చెందిన కుందనేశ్వరి గొందేశి 87.61 ... మిగతా 6వ పేజీలో

నేడు మంత్రి లోకేశ్ రాక

రేపటి సీఎం చంద్రబాబు పర్యటన రద్దు



విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల ఉత్తరాంధ్ర పర్యటనకుగాను సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 8.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో పార్వతీపురం వెళతారు. అక్కడ జరిగే పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొంటారు. స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి పది గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడ టీడీపీ కార్యాలయంలో రాత్రి బస చేస్తారు. పదో తేదీ ఉదయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి, పితృవియోగం కలిగిన ఆయనను పరామర్శిస్తారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని యోగాంధ్రపై సమీక్ష నిర్వహించి, మధ్యాహ్నం ఒంటిగంటకు విజయవాడ బయలుదేరి వెళతారు.

రేపటి సీఎం పర్యటన రద్దు

విశాఖలో ఈ నెల 10వ తేదీన జరగాల్సిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన రద్దయ్యింది. అయితే ఈ నెల 13న మరో కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం ఇక్కడకు వస్తారని సమాచారం. ఈ పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి



విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఐ.వాణి పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రా మెడికల్ కాలేజీలో సీనియర్ ప్రొఫెసర్‌గా, గైనకాలజీ విభాగాధిపతిగా ఆమె పనిచేస్తున్నారు. కొన్నాళ్ల కిందట జరిగిన అసిస్టెంట్ డైరెక్టర్ ప్రమోషన్స్‌లో ఏడీఎంఈగా పదోన్నతి పొందిన ... మిగతా 6వ పేజీలో



పల్లా సింహాచలం అంతిమయాత్రలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, తదితరులు

పల్లా సింహాచలానికి కన్నీటి వీడ్కోలు



- కొత్త గాజువాక శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- పార్థివదేహం వద్ద నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు

గాజువాక/మల్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే, కార్మిక నేత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలానికి ఆదివారం అధికార లాంఛనాల నడుమ కన్నీటి వీడ్కోలు పలికారు.

ముందుగా పల్లా సింహాచలం పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం కొత్తగాజువాకలోని ఆయన స్వగృహంలో ఉంచారు. గాజువాకతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు వేలాది మంది ప్రజలు తరలివచ్చి ఆయనకు నివాళులర్పించారు. అనంతరం కొత్త గాజువాకలోని శ్మశానవాటికలో నిర్వహించిన అంత్యక్రియల్లో పెద్ద కుమారుడు శంకరరావు తండ్రి చితికి నిప్పంటించారు. పోలీసులు తుపాకీలతో గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

తొలుత సింహాచలం పార్థివదేహానికి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తరువాత ఆయన కుమారుడైన పల్లా శ్రీనివాసరావును పరామర్శించారు.అలాగే విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ... మిగతా 6వ పేజీలో



పల్లా శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు

తీరంలో విషాదం

- కుటుంబ సభ్యులతో కలిసి ఆర్కే బీచ్‌కు వచ్చిన స్టీల్‌ప్లాంట్ అసిస్టెంట్ మేనేజర్
- భార్య, పిల్లలతో సముద్ర స్నానం చేస్తుండగా లోపలకు లాక్కుపోయిన కెరటాలు
- స్థానిక యువకులు కాపాడి ఒడ్డుకు తెచ్చేసరికే ఏడేళ్ల కుమారుడి మృతి



కేజీహెచ్‌లో శ్రీపాద సూర్య మృతదేహం

బీచ్ రోడ్డు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సాగరతీరంలో ఆదివారం ఉదయం విషాదం చోటు చేసుకుంది. సముద్రంలో స్నానానికి దిగిన నలుగురిలో ఓ బాలుడు మృతి చెందగా, ముగ్గురు ప్రాణాలతో బయ టపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. కుటుంబంతో సరదాగా గడిపేందుకు స్టీల్ ప్లాంటులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న సంతోశ్ అగనంపూడి నుంచి ఆర్కే బీచ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన భార్య శైలజ, కుమారుడు శ్రీపాద సూర్య (7), కుమార్తె సాయితో కలిసి విక్టరీ ఎట్ సీ ఎదురుగా సముద్రంలో స్నానానికి దిగారు. అందరూ సరదాగా గడుపుతుండగా ఒక్కసారిగా అలల ఉధృతికి నలుగురూ సముద్రంలోకి కొట్టుకుపోసాగారు. సమీపంలో ఉన్న పలువురు యువకులు గమనించి వెంటనే సముద్రంలోకి వెళ్లి వారిని ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే శ్రీపాద సూర్య అస్వస్థతకు గురవ్వడంతో సపర్యలు చేశారు. 108కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి బాలుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ పి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా స్టీల్‌ప్లాంట్ అసిస్టెంట్ మేనేజర్ సంతోశ్‌తో పాటు ఆయన భార్య, కుమార్తె ఉక్కు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

మహారాణిపేట. జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలోని బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో సోమవారం జరిగే షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానున్నందున పీఆర్‌జీఎస్‌ను రద్దు చేశామన్నారు.

వీఎంఆర్‌డీఏలో కూడా...

ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లలో అధికారులంతా నిమగ్నమై ఉన్నందున సోమవారం వీఎంఆర్డీఏలో జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేటితో బదిలీలకు తెర

కోరుకున్న చోటకు వెళ్లేందుకు పలువురు ఉద్యోగులు భారీగా సిఫారసు లేఖలు

- రెవెన్యూ శాఖలో కొలిక్కిరాని జాబితా
- జలవనరులశాఖలో నేడు కౌన్సెలింగ్



విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించి సోమవారంతో తెర పడనున్నది. ఈ ఏడాది బదిలీల నిమిత్తం జారీ చేసిన జీవో మేరకు ఈ నెల రెండుతో గడువు ముగిసినప్పటికీ ఆ తరువాత 9వ తేదీ వరకు పొడిగించారు. జిల్లాలోని పలు శాఖల్లో బదిలీలకు సంబంధించి కసరత్తు చాలావరకు పూర్తి చేయగా, కొన్ని శాఖల్లో బదిలీలు చేశారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీలు చేశారు. గుర్తింపు పొందిన సంఘాల బాధ్యులకు తొమ్మిదేళ్ల వరకు మినహాయింపు ఇస్తున్నారు. కాగా కోరుకున్న చోట బదిలీలకు చాలామంది ఉద్యోగులు సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు. కొందరు రెండు అంతకంటే ఎక్కువగా ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు పొందారు. కొందరు ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉండే ఉద్యోగుల కోసం సంబంధిత అధికారులకు స్వయంగా చెప్పడంతో పాటు ఒత్తిడి తెస్తున్నారు.

ప్రభుత్వంలో కీలకమైన రెవెన్యూ శాఖలో బదిలీలకు జిల్లా యంత్రాంగం చేస్తున్న కసరత్తు ఇంకా కొలిక్కి రాలేదు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా చేస్తున్న బదిలీలకు విశాఖ కలెక్టర్ నోడల్ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో అనకాపల్లి, అల్లూరి జిల్లాల పరిధిలో గల ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జాబితాలు ఆయా జిల్లాల కలెక్టర్లు పంపాలి. జూనియర్ అసిస్టెంట్ నుంచి డీటీ వరకు బదిలీలపై కొంతవరకు జాబితాలు సిద్ధమైనా తహశీల్దార్ల విషయంలో లెక్క తేలలేదని తెలిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అనకాపల్లి, విశాఖ జిల్లాకు, అనకాపల్లి నుంచి విశాఖ, అల్లూరి జిల్లాలకు రానున్న తహశీల్దార్ల సంఖ్య ఎంతన్నది తేలాలి. అప్పుడు విశాఖ నుంచి మిగిలిన రెండు జిల్లాలకు పంపే తహశీల్దార్ల సంఖ్యపై స్పష్టత వస్తోంది. ఈ నేపథ్యంలో తహశీల్దార్ల బదిలీలపై అనిశ్చితి కొనసాగుతుందనే వాదన వినిపిస్తోంది.

కాగా జిల్లా వరకు చూస్తే కొందరు తహశీల్దార్లను బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించారు. వీరిలో ఒకరిద్దరి విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతుందనే ప్రచారం జరుగుతుంది. జిల్లాలో భూముల విలువ ఎక్కువగా ఉండే ఓ మండల తహశీల్దారుపై వస్తున్న ఆరోపణలు, పనితీరుతో బదిలీ చేయాలని అక్కడ ఎమ్మెల్యే తొలుత ... మిగతా 6వ పేజీలో

అస్త్రంతో ట్రాఫిక్ సమస్యలకు అడ్డుకట్ట



యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వంగలపూడి అనిత, సీపీ శంఖబ్రత బాగ్చి, ఇతర అధికారులు, సిబ్బంది

- మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన హోంమంత్రి అనిత
- బెంగళూరు తరువాత విశాఖలోనే వాహనదారులకు అందుబాటులోకి యాప్: సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్యలను వాహనచోదకులు అధిగమించేందుకు 'అస్త్రం' మొబైల్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు పోలీసులు రూపొందించిన అస్త్రం మొబైల్ యాప్‌ను ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలతోపాటు ప్రముఖల పర్యటనలు పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని అధిగమించాలనే లక్ష్యంతో సీపీ శంఖబ్రత బాగ్చి చొరవతో రహదారులపై ట్రాఫిక్ పరిస్థితి ఎలా ఉందనేది ... మిగతా 6వ పేజీలో



డీఈవో కార్యాలయం వద్ద బైఠాయించి నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

కదంతొక్కిన ఉపాధ్యాయులు

- ఎస్జీటీ కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా చేపట్టాలని డిమాండ్
- ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ముట్టడి
- ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ నాశనమవుతుందని ఆవేదన
- నేడు జీవీఎంసీ వద్ద రిలే నిరాహార దీక్ష

- వార్త 7వ పేజీలో

నేడు ఏయూ పాలక మండలి సమావేశం

- కీలక నిర్ణయాలపై చర్చించే అవకాశం



విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ పాలక మండలి సమావేశం సోమవారం జరగనున్నది. ఈ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలపై చర్చించే అవకాశం ఉందని తెలిసింది. ప్రధానంగా కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ప్రమోషన్స్‌తో పాటు పలు విభాగాలకు కంప్యూటర్ల కొనుగోలు, వర్సిటీలో కొన్ని మార్పులకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉందని సమాచారం. సోమవారం ... మిగతా 6వ పేజీలో


పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళా నాయకులు


భీమునిపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న తెలుగు మహిళా నాయకులు


పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో సీఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, తదితరులు

మహిళలను కించపరచడం దారుణం

- జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేనిలను అరెస్టు చేయాలి
- పోలీస్ స్టేషన్లలో తెలుగు మహిళల ఫిర్యాదు

భీమునిపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అమరావతిపైన, ఆ ప్రాంతానికి చెందిన మహిళల పట్ల అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కృష్ణంరాజుతో పాటు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం వారు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి ఆధ్వర్యంలో సీఐ తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రుల అభిమాన రాజధాని అమరావతి దేవతల రాజధాని కాదని,వేశ్యల రాజధాని అని అనుచిత వ్యాఖ్యలు చేసిన వారికి సంస్కారం ఉందా అని ప్రశ్నించారు. డిబేట్‌లో రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడితే బాగుంటుంది గాని, మహిళలను అవమానపరిచేలా మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు రిక్క సత్యవతి, బుత్తల లక్ష్మి, నాయకులు గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్రకుమార్, కనకల అప్పలనాయుడు, పోలిరాజు పాల్గొన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : సాక్షి డిబేట్‌లో పాల్గొన్న జర్నలిస్టు, విశ్లేషకుడు కృష్ణంరాజు అమరావతి మహిళలను వేశ్యలుగా పేర్కొనడం దారుణమని ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ అన్నారు. ఆదివారం ఆమె భీమిలి నియోజకవర్గం తెలుగు మహిళలతో కలిసి కృష్ణంరాజుపై పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు బోయి రమాదేవి, ఐదో వార్డు అధ్యక్షురాలు సరస్వతి, ఆరో వార్డు అధ్యక్షురాలు బబ్బేలు, ఏడో వార్డు అధ్యక్షురాలు లొడగల భవాని, సునీత, వనిత, కంభపు కనకమ్మ, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందపురంలో...

ఆనందపురం : సాక్షి టీవీ ఛానల్, జర్నలిస్టు కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కూటమి నాయకులు సీఐ చింతా వాసునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి మహిళలు వేశ్యలుగా జర్నలిస్టు కృష్ణంరాజు పేర్కొనడం రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బ తీయడమేనన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు తల్లిగా భావించే రాజధానిని కించపరిచినందుకు, ముఖ్యంగా మహిళలను చులకనగా చూసినందుకు సాక్షి టీవీపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బమ్మిడి ఉమ, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ఎల్‌వీపాలెం సర్పంచ్ లొడగల రాజేశ్వరి,టీడీపీ మండల అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, నాయకులు బీఆర్‌బీ నాయుడు, మీసాల సత్యన్నారాయణ, లొడగల రమణ, పాండ్రంకి అప్పలరాజు, లొడగల వెంటకరావు పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : సాక్షి మీడియా, వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు బి. పావని ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు సీఐ సీహెచ్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఛానల్ ద్వారా మహిళలను వ్యక్తిత్వ హననం చేసేవిధంగా ప్రవర్తించారన్నారు. మాజీ సీఎం జగన్ తనపై ఉన్న కేసుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కె. లీలావతి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, ఎంపీటీసీ సభ్యురాలు కె. లక్ష్మి, నందిని, నాయకులు నందీశ్వరరావు, ప్రసాద్, అప్పలనాయుడు, గంగరాజు, ఎర్నాయుడు, నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ రాఘవేంద్రరరావు

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డివిడెండ్లు రూ.43.06 కోట్లు

బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సీతమ్మధార, జూన్ 8, (ఆంధ్రజ్యోతి) : ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ 12 శాతం డివిడెండ్‌ను ప్రకటించిందని, 2024-25 సంవత్సరంలో రూ.71.77 కోట్లు మిగులును సాధించిందని, దానిలో చట్టపరంగా చేయవలసిన రిజర్వ్‌లను ఆయా ఖాతాలకు జమ చేసి మిగిలిన మొత్తంలో రూ.43.06 కోట్లను డివిడెండ్ 12 శాతంగా జమ చేయగలమని బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. జాతీయ రహదారి పక్కన మద్దిలపాలెంలో గల కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో బ్యాంక్ 110వ మహాజన సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాఘవేంద్రరావు మాట్లాడుతూ 202-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ డిపాజిట్లలో రూ.206.64 కోట్లు పెరుగుదలతో రూ.4,354.73 కోట్లకు చేరుకుని 4.98 శాతం వృద్ధి సాధించినట్టు వెల్లడించారు. రుణాలలో రూ.238.33 కోట్ల పెరుగుదలతో రూ.3,436.47 కోట్లకు చేరుకుని 7.42 శాతం వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. బ్యాంకు నిరర్థక ఆస్తుల సంఖ్య 458 గాను, మొత్తం రూ.64..59 కోట్లు నిరర్థక ఆస్తుల శాతం 1.88కు చేరుకుందన్నారు. నికర నిరర్థిక ఆస్తులు గత ఏడాదిలో సున్నా శాతంగా ఉందన్నారు. బ్యాంకు పూర్వ అధ్యక్షుడు, మార్గ దర్శకులు మానం అంజనేయులు మాట్లాడుతూ లక్షకు పైబడి ఉన్న సభ్యులకు సహకార రంగంపై అవగాహన, శిక్షణ, విద్య అందించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని పాలకవర్గానికి సూచించారు. సంప్రదింపుల కమిటీ సభ్యులు మరింత క్రియాశీలకంగా పని చేయాలని అభిప్రాయ పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం లేనప్పటికీ మన బ్యాంక్ లాభాలు ఆర్జిస్తోందని తెలిపారు. బ్యాంక్ పూర్వ జనరల్ మేనేజర్ ఏవీ రామకృష్ణారావు బ్యాంకుకు చేసిన సేవలను గుర్తింపుగా పాలకవర్గం ఘనంగా సన్మానించారు. వివిధ బ్రాంచీల సంప్రదింపుల కమిటీ సభ్యులు అభిప్రాయాలు, సూచనలు తెలియచేశారు. సమావేశంలో బ్యాంకు సీఈవో వీవీబీ వరలక్ష్మి, డైరెక్టర్లు వీవీ నరసింహమూర్తి, జేవీ సత్యనారాయణమూర్తి, బ్యాంకు ఉపాధ్యక్షులు ఎం.రాఘవరావు, డైరెక్టర్లు, బ్యాంక్ అధికారులు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి అభినందనలు

భీమునిపట్నం (రూరల్), జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట గ్రామానికి చెందిన షేక్ అమీనా ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో అధిక మార్కులు సాధించడంతో గ్రామస్తులు ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో బాలికకు 470 మార్కులకు 467 రావడంతో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగనబంద సర్పంచ్ జీవీ నారాయణ, టీడీపీ నాయకులు గుడ్డాల ఎల్లయ్య, గాడు తాతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఎండాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం యోగా శిక్షణ నిర్వహించారు. శిక్షకుడు గిరి పలువురితో ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని చెప్పారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం అవసరం

పద్మనాభం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఆయన రెడ్డిపల్లిలో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గత 11 ఏళ్లలో ప్రధాని మోదీ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని చెప్పారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఐదుగురి ఎంపిక

తగరపువలస, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు ఎనిమిదవ తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఆదివారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో పాఠశాలకు చెందిన రిక్క రేష్మ, ఆర్. శ్రావ్య, బి. లిఖిత, మాధురి సాహూ, జి. రితిక జాతీయ స్థాయి ఉపకార వేతనాలకు ఎంపికైనట్టు పరీక్షల సమన్వయకర్త పక్కి నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన బాలికలకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నెలకు రూ. వెయ్యి చొప్పున ఏడాదికి రూ. 12 వేలు ఉపకార వేతనం వస్తుందని చెప్పారు.

కాలువల్లో పూడికలు తీయాలని నిరసన

మధురవాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ మార్కెట్ వద్ద కాలువల్లో పూడికలు తీయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ మార్కెట్ వద్ద కాలువలు పొంగి మురుగు నీరు రోడ్లపైకి చేరుతుందన్నారు. రోడ్లపై మురుగు వరదలా ప్రవహిస్తున్నా.అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నేత పి. రాజుకుమార్ మాట్లాడుతూ మధురవాడ వంతెన కింద, రేవళ్లపాలెం రోడ్డు వర్షం పడితే చెరువులా మారుతున్నాయని,సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు ఏడుగురి ఎంపిక

పద్మనాభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈఏడాది పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు పొందిన ఏడుగురు విద్యార్థులను ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక చేసిందని ఎంఈఓ పి. రమణ చెప్పారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 588 మార్కులు పొందిన ఎం.పూర్ణ తేజశ్రీ, వాణి సంతోష్, జి.హిమశ్రీ, 581 మార్కులు పొందిన బి. వంశీ, 574 మార్కులు పొందిన ఆర్. బాలాజీ, 576 మార్కులు పొందిన బి. మేఘన, 503 మార్కులు పొందిన జె. మౌనిక, కె. హర్షవర్ధిని అవార్డులకు ఎంపికయ్యారని చెప్పారు. వారికి సోమవారం ఉదయం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చేతుల మీదుగా ఏయూ బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో అవార్డులు ప్రదానం చేస్తారని ఎం ఈఓ పేర్కొన్నారు.

ఈత సరదాతో ప్రాణాలు తీసుకోవద్దు

పద్మనాభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : యువత ఈత సరదాతో నీటిలో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ సూచించారు. మండలంలోని కుద్రపల్లి గోస్తనీ నదిపై ఉన్న ఆనకట్ట వద్ద విశాఖపట్నం నుంచి వచ్చిన యువకులు లోతుగా ఉన్న ప్రాంతంలో ఈతకు దిగిన విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లారు. ఈత ఆడుతున్న యువతను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో ఇక్కడ ఈత కోసం దిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని, తల్లిదండ్రులతో చెప్పకుండా ఇంతదూరం వచ్చి కోరి ప్రమాదాలు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. మళ్లీ ఇక్కడికి ఈతకు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి ఈతకు దిగిన ఎనిమిది మందిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి

... 5వ పేజీ తరువాయి

ఆమె తాజాగా కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. గత ఏడాదిన్నరగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద వ్యవహరిస్తున్నారు. ఇప్పటికి పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను ఆరోగ్యశాఖ నియమించింది. సోమవారం బాధ్యతలు స్వీకరించేందుకు డాక్టర్ వాణి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కేజీహెచ్ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.

సందడిగా పర్యాటక ప్రాంతాలు


సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్, రుషికొండ బీచ్ పర్యాటకులతో ఆదివారం సందడిగా కనిపించాయి. సాగర్‌నగర్, రుషికొండ బీచ్, తిమ్మాపురం రామానాయుడు స్టూడియోను ఎక్కువ మంది సందర్శించారు. రుషికొండ బీచ్‌లోకి వెళ్లే ప్రధాన మార్గం వాహనాలతో కిక్కిరిసిపోయి ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ రహదారిలో ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయడంతో ఈ సమస్య నెలకొంది. కాగా ఐదేళ్ల క్రితం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రుషికొండ బీచ్‌లో ఏర్పాటు చేసిన పాక శనివారం రాత్రి కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ముగిసిన చందనం అరగదీత

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి మూడో విడత చందన సమర్పణకు అవసరమైన చందనం అరగదీత ఆదివారంతో ముగిసింది. తొలిరోజు 34 కిలోలు, రెండవ రోజు 49 కిలోలు, మూడవ రోజు 50 కిలోలు చందనాన్ని అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనపు ముద్దను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి బాండాగారంలో భద్రపరిచారు. అందులో 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిశిత చేసి ఈనెల 11వ తేదీ నాటి జేష్ఠ పౌర్ణమి నాడు స్వామివారికి సమర్పించనున్నారు.

‘98వ వార్డును పెందుర్తి జోన్‌లో కొనసాగించాలి’

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్‌ల పునర్విభజనలో భాగంగా 98వ వార్డును భీమిలి జోన్‌లో కలపాలన్న ప్రతిపాదన అధికారులు విరమించుకోవాలని కార్పొరేటర్ పివి నరసింహం కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమిలి జోన్‌లో కార్యాలయం పెట్టడం వల్ల ఈ ప్రాంత ప్రజలు సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పెందుర్తి జోన్‌లోనే 98వ వార్డును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ


శిఖర ప్రతిష్ఠ కలశల ఊరేగింపు

పద్మనాభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం పంచాయతీ అర్చకునిపాలెంలో పైడితల్లి, మరిడమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. తొలుత వేద పండితుల ఆధ్వర్యంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మండపారాధన, విశేష హోమాలు నిర్వహించారు. తరువాత అమ్మవార్లకు ప్రత్యేక పూజల, అర్చనలు చేశారు. అనంతరం కలశలను గ్రామమంతా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నపూర్ణ, సన్యాసిరావు దంపతులు, టి. పైడిరాజు, సావిత్రి, పద్మనాభస్వామి, నరసింహనాయుడు, ఎర్నాయుడు, శ్రీను పాల్గొన్నారు.

చేపల తిమ్మాపురం బీచ్ పరిశుభ్రం

భీమునిపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చేపల తిమ్మాపురం తీరంలో ప్లాటిపస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ సాగర్ కార్యక్రమం నిర్వహించారు. తీరంలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి రవీంద్ర మాట్లాడుతూ ప్రపంచ సముద్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి లక్ష విరాళం

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన జి. నరసింహారావు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ. 1,01,116లను ఆదివారం ఆయన దేవాలయ ప్రజా సంబంధాల అధికారి పద్మనాభరాజు (విక్రమ్)కు నగదు రూపంలో అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

సింహగిరికి భక్తుల తాకిడి


పీఆర్ఓ ఆఫీసు వద్ద సిఫార్సులతో భక్తులు

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సూర్యోదయం నుంచే తొలిపావంచా వద్ద సందడి ప్రారంభమైంది. తొలుత వరాహ పుష్కరిణిలో స్నానాలు చేసి భైరవస్వామిని దర్శించుకుని అక్కడి నుంచి సింహగిరికి చేరుకున్నారు.

సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ సరిహద్దు దేవత సత్తెమ్మతల్లి (మరిడిమాంబ)కి భక్తులు ఆదివారం పసుపు కుంకుమ సమర్పించారు. అమ్మవారి వార్షిక పండగ మూరు వారం పురస్కరించుకుని ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కోళ్లు, చీరలు చూపి మొక్కులు తీర్చుకున్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

తగరపువలస, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలాజీ నగర్‌లో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కజకులపేట గ్రామానికి చెందిన దువ్వావు సత్య ప్రకాశ్ (31) దివీస్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన లక్ష్మీ దుర్గతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారు కొన్ని నెలలుగా బాలాజీనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రకాశ్ వైద్యుల సూచనల మేరకు విధులకు వెళ్లకుండా ఇంటి వద్ద చికిత్స తీసుకుంటున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో కుర్చీలో నుంచి ఒక్కసారిగా కింద పడిపోయి, నోటి నుంచి నురుగులు రావడంతో అతని భార్య సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. లక్ష్మీ దుర్గ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందపురంలో కారు దగ్ధం

ఆనందపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :శొంఠ్యాం గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కారుకు నిప్పు పెట్టారు. సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డపు శ్రీనివాసరావు తనకు చెందిన స్థలంలో కారును పార్కు చేశారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కారు మంటల్లో కాలిపోతున్నట్టు కొంత మంది వ్యక్తులు శ్రీనివాసరావుకు ఫోన్ చేసి చెప్పగా వెంటనే ఆయన సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

భీమునిపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాత్యాయిని సహిత భీమేశ్వరాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఆదివారం వైభవంగా జరిగింది.ధ్వజ స్తంభం జీర్ణావస్థకు చేరడంతో పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి గుగ్గిళ్ళ గురునాథ్ గుప్తా, విజయలక్ష్మి దంపతులు నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపనకు ముందుకు వచ్చారు. ఆ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, పూజలు చేసి, నూతన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు.

పైడితల్లమ్మ పండగకు ఏర్పాట్లు


శిరస్సున గరగలతో పూజారి

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి సహోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ వార్షిక ప్రధాన పండగ మంగళవారం నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పండగలో భాగంగా ఈనెల 4 నుంచి గ్రామంలో గరగలతో తిరువీధి ఉత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని శతకం పట్టు వద్ద నిర్వహించనున్నారు. ప్రధాన పండుగ 10న సాయంత్రం జరపనున్నారు. తొలేళ్ల పురస్కరించుకుని సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో సింహాచల ప్రధాన కూడలిలో ప్రత్యేక వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన పండగను పురస్కరించుకుని కార్పొరేటర్ నరసింహం కొండదిగువ దేవస్థానం బస్టాండ్‌లో వేదికపై డ్రీ విన్నర్ల నృత్యాలు, పాడుతా తీయగా గాయకుల పాటలతో కూడిన సినీ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేస్తున్నారు.

‘అస్త్రం’తో ట్రాఫిక్ సమస్యలకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

పోలీసులతో పాటు ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసునేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. టెలీగ్రామ్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే నగర రోడ్లపై ట్రాఫిక్ పరిస్థితి, ఎక్కడైనా ప్రమాదం జరిగి ట్రాఫిక్ జామ్ అవ్వడం, వీఐపీలు ఎవరైనా ఉంటే ఏ రూట్‌లో ప్రయాణిస్తున్నారనేది ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ 15 నిమిషాలకు సమాచారం అప్‌డేట్ అవుతుంది కాబట్టి రద్దీ మార్గాల్లో కాకుండా ప్రత్యమ్నాయ మార్గాల్లో ప్రయాణించడం ద్వారా సమయం ఆదా చేసుకునేందుకు ఈ యాప్ ఉపకరిస్తుందని అనిత పేర్కొన్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ అస్త్రం యాప్ దేశంలో బెంగళూరు తరువాత విశాఖ నగరంలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. విజయవాడలో యాప్ ఉన్నప్పటికీ అది కేవలం పోలీసులకు మాత్రమే అందుబాటులో ఉందని, విశాఖలో మాత్రం ప్రజలకు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ యాప్‌ను ప్రతీ 15 నిమిషాలకు అప్‌డేట్ చేయడం జరుగుతుందని, తద్వారా తాజా సమాచారం వాహనదారులకు లభిస్తుందని వెల్లడించారు. ఈ యాప్ వల్ల ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి పోలీసులు తక్షణమే క్లియర్ చేసేందుకు సహకరిస్తుందన్నారు. వెబ్ అప్లికేషన్ డేటా ఆధారంగా నెలవారీ నివేదికలను రూపొందించడం, ట్రాఫిక్ రద్దీ తరచూ ఎక్కువగా ఉండే జంక్షన్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సూచనలను అందించడం వంటి అనేక ప్రయోజనాలు ఈ యాప్ ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. మరో మూడు నెలల్లో పూర్తి స్థాయిలో యాప్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని సీపీ వివరించారు. యాప్‌ను అభివృద్ధి చేసిన తిరుమలరావు, శ్రీనివాస్‌లను ఆయన అభినందించారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లను హోంమంత్రి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, అజితా వేజెండ్ల, కృష్ణ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

... 5వ పేజీ తరువాయి

స్కోరుతో మూడో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 46) సాధించింది. అలాగే గాజువాకకు చెందిన యలవర్తి సాయి సిద్ధార్థ 86.54 స్కోరుతో నాలుగో (రాష్ట్ర స్థాయిలో 61) ర్యాంకు, సింహాచలం ప్రాంతానికి చెందిన సతి జయశృతి 86.10 స్కోరుతో ఐదో (రాష్ట్ర స్థాయిలో 70) ర్యాంకు, వేపగుంటకు చెందిన మూల వెంకట సాయి కృష్ణ 84.87 స్కోరుతో ఆరు (92), మద్దిలపాలేనికి చెందిన గొట్టిపల్లి శృతిహాసిని 84.16 స్కోరుతో ఏడో (105) ర్యాంకు, గాజువాకకు చెందిన గొలగాని తేజేశ్ 82.35 స్కోరుతో ఎనిమిది (145), మాధవధారకు చెందిన చింటాడ రిషిత 81.65 స్కోరుతో తొమ్మిది (176), అక్కయ్యపాలేనికి చెందిన శొంఠి నాగలలిత శ్రావ్య 81.38 స్కోరుతో పదో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 181) సాధించారు.

భారీగా హాజరైన విద్యార్థులు

ఏపీఈఏపీ సెట్‌కు జిల్లాకు చెందిన వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 32,026 మంది దరఖాస్తు చేసుకోగా 30,505 (95.25 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 22,111 (72.48 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో ప్రవేశాలకు సంబంధించిన పరీక్షకు 9,137 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8,340 (91.27 శాతం) మంది హాజరయ్యారు. వీరిలో 7,411 (88.86 శాతం) మంది విద్యార్థులు అర్హత సాధించారు.

నేటితో బదిలీలకు తెర

... 5వ పేజీ తరువాయి

జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఇందుకు అనుగుణంగా బదిలీకి యంత్రాంగం నిర్ణయించింది. అయితే ఏం జరిగిందో గానీ తాజాగా సదరు తహశీల్దారును బదిలీ చేయవద్దని ఒత్తిడి తెస్తున్నారని రెవెన్యూ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది. మరో తహశీల్దారును అప్రాధాన్యత గల మండలానికి పంపాలని నిర్ణయించారు. కలెక్టరేట్‌లో నాలుగు సెక్షన్లు ఉండగా ప్రస్తుతం రెండింటికే ప పూర్తి స్థాయి సూపరింటెండెంట్లు ఉండగా, మరో రెండు ఇన్‌చార్జిలతో నడుస్తున్నాయి. రెగ్యులర్ సూపరింటెండెంట్లలో ఏవోగా ఉన్న ఈశ్వరరావు వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. అందువల్ల కలెక్టరేట్‌లోని నాలుగు సెక్షన్లకు పూర్తి స్థాయిలో సూపరింటెండెంట్లను నియమించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి సీనియర్లను తీసుకురావడం, జిల్లాలో ఉన్న డీటీలలో సీనియర్లకు అడహాక్ పదోన్నతులు ఇవ్వాలని భావిస్తున్నారు. ఇదిలావుండగా జలవనరుల శాఖలో బదిలీలకు సంబంధించి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ శాఖలో బదిలీల కోసం పలువురు ఉద్యోగులు రెండు అంత కంటే ఎక్కువగా సిఫారసు లేఖలు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేసే అవకాశం ఉందని కొందరు ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పల్లా సింహాచలానికి కన్నీటి వీడ్కోలు

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధరప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావుతో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

నేడు ఏయూ పాలక మండలి సమావేశం

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ఆఫ్‌లైన్, వర్చువల్ విధానంలో సభ్యులు పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి సభ్యులకు ఇప్పటికే సమాచారాన్ని వర్సిటీ అధికారులు అందజేశారు. ఇదిలావుండగా ప్రస్తుతం కొనసాగుతున్న పాలక మండలిపై వర్సిటీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావచ్చింది. ఇప్పటికీ ఏయూకు నూతన పాలక మండలిని ఏర్పాటు చేయలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పాలక మండలి సభ్యులతోనే సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో చర్చించే అంశాలు, తీసుకునే నిర్ణయాలకు సంబంధించిన సమాచారం బయటకు వెళ్లిపోయే అవకాశం ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

కళలకు నిలయం ఉత్తరాంధ్ర

» నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, వేదికపై కార్పొరేటర్ సునీత తదితరులు

ఆరిలోవ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జానపద కళాకారులు గజ్జెల సవ్వడి., డప్పుల మోతతో ఆరిలోవ ప్రాంతం మారుమోగింది. నవచైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆరిలోవ కాలనీలోని శివాజీ నగర్ ముత్యాలమ్మ అమ్మవారి గుడి వద్ద సంఘం గౌరవాధ్యక్షుడు పిల్లి వీర్రాజు ఆధ్వర్యంలో జానపద కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ.. కళలకు ఉత్తరాంధ్ర నిలయం అన్నారు. కళలను ఆదరించడం ద్వారా సమాజానికి మంచి జరుగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి కళా ప్రదర్శనల వల్ల భావి తరాలకు మంచి సందేశం అందించనట్టవుతుందన్నారు. ఒక సందేహాన్ని సులభంగా సామాన్య జనంలోకి తీసుకెళ్లాలంటే కళలు చక్కని సాధనం అన్నారు. మన సంప్రదాయ కళలను ఆదరించాలని పిలుపునిచ్చారు. ఇది మనందరి బాధ్యత అన్నారు. జానపద కళల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు, తప్పెలగుళ్ల, హరిదాసు వేషధారణ, పిట్టల దొర వంటి కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పాత్ర కుండా ధర్మారావు, కళాకారుల సంఘ అధ్యక్షుడు చెన్నారెడ్డి, కొనతల రాజు, మస్తాన్ టీడీపీ స్థానిక నేతలు యల్లమిల్లి సురేష్, మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే బీచ్‌లో ఏయూ విద్యార్థుల 'స్వచ్ఛత'



స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, పాల్గొన్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

బీచ్‌రోడ్డు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ జీపీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఆర్కే. బీచ్‌లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. వరల్డ్ ఓషియన్ డే పురస్కరించుకొని ఏయూ సిబ్బంది, విద్యార్థులు తీరంలో ఉన్న వ్యర్థాలనుతొలగించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిసరాల శుభ్రంగా ఉంచితే ఆరోగ్యపరంగా మంచిదన్నారు. తీర ప్రాంతాల పరిశుభ్రత వల్ల సముద్ర జీవరాశులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పర్యాటకులకు కూడా బీచ్ ఆహ్లాదకర వాతావరణంగా కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసీతారామ సేవా మండలి నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు

వెంకోజీపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలోని శ్రీసీతారామ సేవా మండలి నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు, ఉపాధ్యక్షులుగా మద్ది శశిభూషణరెడ్డి, కార్యదర్శిగా సూరిశెట్టి అప్పలరాజు (బుజ్జి), సహాయ కార్యదర్శి సూరిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి పెంటకోట రమేష్, ఆడిటర్‌గా రాపేటి గోవింద్‌రాజు ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. వీరు ఏడాది పాటు కమిటీ కార్యవర్గంగా కొనసాగనున్నారు.

కదంతొక్కిన ఉపాధ్యాయులు

» వందలాదిగా తరలి వచ్చిన టీచర్లు
» ఎస్జీటీ కౌన్సెలింగ్ మ్యానువల్‌గా చేపట్టాలంటూ డిమాండ్



ఆర్జేడీ విజయభాస్కర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వందలాది మంది ఉపాధ్యాయులు చేరుకొని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో 'వెబ్ కౌన్సిలింగ్ వద్దు - మాన్యువల్ కౌన్సెలింగ్ మాత్రం ముద్దు' అనే నినాదంతో డీఈవో కార్యాలయం ఆవరణ మార్మోగింది. ఎస్జీటీ ఉపాధ్యాయులకు మ్యానువల్ కౌన్సెలింగ్ మాత్రమే చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి విరుద్ధంగా మరే ప్రత్యామ్నాయ విధానాలను చేపట్టవద్దని కోరారు. గతంలో ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్జీటీలకు మ్యానువల్ కౌన్సిలింగ్ జరిపి తీరాలని పట్టుపట్టారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ వందల వెబ్ కౌన్సిలింగ్‌ల వందల కొద్దీ ఆప్షన్‌లను ఎంచుకోవాలని, ఇది కష్టతరంగా ఉంటుందన్నారు. కాబట్టి అధికారులు తమ ఆవేదనను అర్థం చేసుకొని మ్యానువల్ విధానంలో కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించకుండా అర్థరహిత నిర్ణయాలను చేసి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి ఉపాధ్యాయుల సంఘాల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం అనంతరం ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్జేడీ) కె.విజయభాస్కర్, జిల్లా విద్యాశాకాదికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు డీఈవో ముట్టడి నేపథ్యంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ నేతలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.గోపీనాథ్ (పీఆర్టీయూ) ఇమంది పైడిరాజు (ఎస్టీ యూ) టి.చిన్నబాబు (యూటీఎఫ్) టి.రామకృష్ణారావు(ఏపీటీఎఫ్) అరుణ్ కుమార్, వీరభద్ర రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ వద్ద ఉపాధ్యాయుల రిలే నిరాహార దీక్ష

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి వెబ్ ఆప్షన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఉపాధ్యాయ ఐక్య సంఘాల వేదిక పిలుపునిచ్చింది.

ఉత్సాహంగా అంధ మహిళల అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉక్కు స్టేడియంలో అంతర్రాష్ట్ర అంధ మహిళల క్రికెట్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ సంస్థ సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ కేరళ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ప్రారంభ కార్యక్రమంలో విజువల్లి ఛాలెంజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు ప్రసంగించారు. ఈసారి పోటీలు విశాఖలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అంధులు క్రికెట్ ఎలా ఆడుతారని, వారికి ఆటలెందుకన్న వారికి ఇదో ఉదాహరణ అన్నారు. అంధులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వీరిని ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. దృష్టి లోపం ఉన్న వారు ఆటల్లో పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. దృష్టి లోపం ఉన్న వారికి అన్ని విధాలా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాది శరత్‌బాబు, ఎన్టీపీసీ అధికారి అనిత్, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డి, పోటీల కోఆర్డినేటర్ అప్పినాయుడు, నరేశ్ పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు...

మొదటి రోజు ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల జట్ల మధ్య పోటీ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు నిర్దేశిత 15 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 185 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన కేరళ జట్టు కేవలం 79 పరుగులు చేసి పరాజయం పాలైంది. అలాగే డిల్లీ, ఒడిశా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు 15 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 126 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన డిల్లీ జట్టు 14.5 ఓవర్లలో కేవలం 77 పరుగులు మాత్రమే చేసి పరాజయం చెందింది.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి



జంతువుల మోటు వద్ద సందర్శకులు

» రూ.6.39 లక్షల ఆదాయం

ఆరిలోవ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. నగరంలో వేడి వాతారణం నెలకొనడంతో అధిక సంఖ్యలో ఉండడంతో చల్లదనం కోసం జూ పార్కును సందర్శించినట్టు కొందరు సందర్శకులు తెలిపారు. సుమారు ఎనిమిది వేల 131 మంది సందర్శకులు జూ పార్కుని సందర్శించగా, వారి నుంచి సుమారు ఆరు లక్షల 39 వేల రూపాయల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ వెల్లడించారు.



సందర్శకులతో కిటకిటలాడుతున్న జూ

సముద్ర కెరటాలకు ఉక్కు ఉద్యోగి బలి



మృతి చెందిన దావూద్

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సముద్ర కెరటం బలంగా తాకడంతో ఉక్కు ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన అప్పికొండ బీచ్‌లో ఆదివారం జరిగింది. ఇస్లాం పేట ప్రాంతానికి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఎండీ.దావుద్ (45) ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అప్పికొండ బీచ్‌కు వెళ్లారు. సముద్ర తీరంలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా కెరటం బలంగా తాకడంతో దావుద్ వెనక్కి పడిపోయాడు. దీంతో స్పృహ కోల్పోయిన దావుద్‌ను హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దావూద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సీఏఎస్ఏ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇండోర్ జిమ్నాజియం హాలులో జరిగిన సీఏఎస్ఏ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. ప్రత్యేకంగా చార్టెడ్ అకౌంట్స్ విద్యార్థుల మధ్య జరిగిన ఈ టోర్నీ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లలో పురుషులు, మహిళల విభాగాలలో షట్లర్లు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. పురుషుల సింగిల్స్‌లో భరత్, డబుల్స్ విభాగంలో భరత్-గౌతమ్; మహిళల సింగిల్స్‌లో ప్రీతికదాస్, డబుల్స్‌లో విష్ణుప్రియ-పూజిత., మిక్స్‌డ్ సింగిల్స్‌లో విష్ణుప్రియ, డబుల్స్‌లో విష్ణుప్రియ-సాయి పృథ్వీ విజేతలుగా నిలిచారు.

వీఎంఆర్డీఏ 'డెక్' భవనాన్ని పరిశీలించిన కలెక్టర్



ఇంజనీరింగ్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరింధర ప్రసాద్, పక్కన వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక భవన సముదాయం 'డెక్' భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదివారం వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభించనున్న ఈ భవనానికి సంబంధించిన అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భవనం బాహ్య రూపం ఆకర్షణీయంగా ఉండేలా, అంతర్భాగంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన తేదీ ఖరారు అయ్యే నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రజాప్రాధాన్యం కలిగిన ఈ నిర్మాణాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అమరావతి మహిళలపై అనుచితవ్యాఖ్యలు చేసినవారిపై చర్యలు తీసుకోండి



హోంమంత్రి అనిత, సీపీ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అమరావతి వేశ్యల రాజధాని అంటూ అమరావతి మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో హోంమంత్రి వంగలపూడి అనిత, సీపీ శంఖబ్రతబాగ్చికి ఆదివారం ఫిర్యాదుచేశారు. ఒక టీవీ ఛానల్ డిబేట్‌లో జర్నలిస్టులు ముసుగులో కొందరు అమరావతి వేశ్యల రాజధాని అంటూ సంబోధించడం రాష్ట్రంలోని మహిళలందరినీ మనోభావాలను దెబ్బ తీసినట్టేనని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ వ్యాఖ్యలు చేసిన వారితో పాటు వారి వెనుకున్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదుచేసిచర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో తెలుగుమహిళా జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాతతో పాటు పలువురు మహిళా నేతలు ఉన్నారు.

కనకదుర్గమాంబ ఉత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

వెంకోపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు పరిధిలోని ఇసుకతోట గ్రామ ఇలవేల్పు కనకదుర్గమాంబ వార్షిక మహోత్సవంలో భాగంగా ఆదివారం చాటింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈ నెల 10న అనుపు మహోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, బొట్టా శివ, అధ్యక్షులు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ప్రసాది అప్పారావు, కార్యదర్శి ఒమ్మి గోపికృష్ణ, కోశాధికారి గొలగాని రాజు, అధ్యక్షులు ఈగల శివ గోవింద్, ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, ప్రధాన కార్యదర్శి బొట్టా గణేష్, కోశాధికారి పల్లా శివ, సహాయ కార్యదర్శి మువ్వల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 35 దొండకాయలు 28, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు44, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 38, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

15 రోజులుగా అంధకారంలో పెదగదిలి బీఆర్టీఎస్ రోడ్డు



వీధి దీపాలు వెలగక అంధకారంలో ఉన్న రోడ్డు

ఆరిలోవ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్ నుంచి పెదగదిలి, చినగదిలి వరకు గల బీఆర్టీఎస్ రోడ్డులో వీధిలైట్లు వెలగక రోడ్డు రాత్రి వేళల్లో గాఢాంధకారం నెలకొంటోంది. గత 15 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉందని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చీకటి కారణంగా రోడ్లపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఆర్టీఎస్ రోడ్డులో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను, ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను సుందరంగా అలంకరించి, ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పుష్ప వేదికపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో పాంచరాత్రాగమశాస్త్ర విధానంలోవిశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి, నారసింహునికి అష్టోత్తర శతనామార్చన చేయించారు. తరువాత కలశారాధన, బింబారాధన, మండపారాధన చేసి హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. పండితులు, అర్చకులు పంచసూక్తాలు, సుదర్శన, నారసింహమూర్తి, మూలమంత్రాల పఠనం నడుమ రుత్విక్‌లు హవనాన్ని చేశారు. మహాపూర్ణాహుతి చేసి ప్రధాన కలశాన్ని మంగళవాయిద్యాల నడుమ అంతరాలయంలోకి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులోని పవిత్ర జలాలతో భక్తులకు ప్రోక్షణ కావించారు. దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు, పూర్వపు ఈవో విజయనగరం డీఆర్ఓ శ్రీనివాసమూర్తి ఇస్కాన్ ఛైర్మన్ సింబయాసిస్ ఒరుగంటి నరేశ్, రైల్వే చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఈఓ శ్రీనివాసరావు, ఈఈ బండారు రాంబాబు సారథ్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

రైతుబజార్‌లో కూరగాయల కొరత

» మామిడి పండ్ల దుకాణాలే అధికం » అపరిశుభ్రంగా ఆవరణ



మామిడి పండ్లు విక్రయిస్తున్న రైతులు

పెదవాల్తేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రైతుబజార్లకు కూరగాయల కొరత వేదిస్తోంది. రైతుబజార్లల్లో అందరూ మామిడిపండ్లు, మామిడికాయలు అమ్మకాలు సాగిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది అని కొనుగోలుదారులు అంటున్నారు. అనందపురం, వెల్లంకి, ఎస్.కోట, కె.కోటపాడు, సబ్బవరం తదితర ప్రాంతాల రైతులు ఎంతోకొంత కూరగాయలు తీసుకువచ్చేవారు. ప్రస్తుతం అధిక శాతం మంది రైతులు క్యారెట్, బీట్‌రూట్, క్యాప్సికమ్, అరటికాయలు, వంకాయలు, వంటి కూరగాయలు కూడా హోల్‌సెల్ నుంచి తీసుకురావడం మానేసి మామిడిపండ్లు తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నారు. గతంలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు దొండకాయలు, బెండకాయలు, బరబాటి, మునగకాడలు, ఆనపకాయులు వంటి కూరగాయలు తీసుకువచ్చేవారు. కానీ రైతుబజారులో టమాటా, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, మామిడిపండ్లు అమ్మకాలు జరుగుతున్నాయి. అయితే రైతుబజార్‌కు పూర్తిగా కూరగాయలు తీసుకురావడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి రైతుబజార్‌పై దృష్టిచారించి పూర్తి స్థాయిలో కూరగాయలు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. అలాగే రైతుబజార్‌లో మొత్తం 72 స్టాళ్లు ఉన్నాయి. అంతే కాకుండా కొనుగోలుదారులు వెళ్లడానికి వీలు లేకుండా క్రేటులు, చెత్తాచెదారం వేయడంతో వినియోగదారులు రైతుబజార్‌కు వస్తే కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఆధికారులు స్పందించి రైతుబజార్ సక్రమ నిర్వహణపై దృష్టి సారించాలని వినియోగదారులు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన రైతుబజార్ ప్రాంగణం

పోర్టు స్టేడియంలో ఉత్సాహంగా యోగాంధ్ర

» ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఉమామహేశ్వరరావు

అక్కయ్యపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21వ తేదీన విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాల్లో భాగంగా ఆదివారం స్థానిక పోర్టు స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర వేడుకలు ఉత్సాహంగా సాగాయి. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, యూసీడీ మహిళలు, విద్యార్థులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు భాగస్వామ్యమయ్యారు. యోగా శిక్షకుల సూచనలకు అనుగుణంగా వివిధ ఆసనాలు వేశారు. ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు ఏకధాటిగా సాగిన కార్యక్రమంలో యోగాసనాలతో పాటు ఓం శాంతి ఆధ్వర్యంలో ధ్యానం కూడా చేశారు. ఉమామహేశ్వరరావు (78) అత్యంత క్లిష్టమైన ఆసనాలు వేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభ్యులందరూ కరతాళధ్వనులతో ఆయనను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక, ఆయూష్ విభాగం అధికారులు, ఇతర ప్రముఖులు యోగా అవశ్యకతను తెలుపుతూ సందేశాన్ని అందించారు. ఈ నెల 21న విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో స్వచ్ఛందంగా భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి జె.మాధవి, ఆయుష్ విభాగం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకుడు బొడ్డేటి కాశీవిశ్వనాథ్, ఎస్‌డీసీ సత్తిబాబు, పౌరసరఫరాల అధికారి భాస్కరరావు, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, యోగా అసోసియేషన్ ప్రతినిధులు, యూసీడీ సభ్యులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న నగర వాసులు


ఆసనాలతో ఆకట్టుకున్న ఉమామహేశ్వరరావు

'వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'

మురళీనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) ; వాహనదారులు రోడ్లపై ప్రయాణించే సమయంలో పూర్తి అప్రమత్తత పాటించాలని ట్రాఫిక్ విభాగం కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాశరధి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పర్యవేక్షణలో ఆర్ అండ్ బీ హైవే సిగ్నల్ పాయింట్ వద్ద ఆదివారం వాహన రికార్డుల తనిఖీ చేపట్టారు. ఏఎస్‌ఐ వెంకరమణ, సిబ్బంది ద్విచక్రవాహన రికార్డుల తనిఖీలు చేపట్టారు. పెండింగ్ చలానాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, రాంగ్ రూట్, బైక్‌పై ముగ్గురేసి వెళుతూ అతి వేగంగా నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై ప్రయాణికులకు అవగాహన కల్పించి అపరాధ రుసుం వసూలు చేశారు. ప్రధానంగా నగర ప్రాంతాలను కలపుతూ ఉండే జాతీయ రహదారులపై యువత ప్రయాణ సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. హైవేలలో వెళ్లే భారీ వాహనాలను ఓవర్ టేక్ చేయాలనే సాహసాలు చేయకుండా వాహనాలను నియంత్రణలో నడపాలని కోరారు.


వాహనాల తనిఖీలు నిర్వ హిస్తున్న పోలీసులు

కడప స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

» ఈ నెల 19వ తేదీలోగా పేర్లు నమోదుకు అవకాశం

విశాఖపట్నం, స్పోర్ట్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో కడప స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5వ తరగతి చదువుతున్న చిన్నారుల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విశాఖ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్ తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి ఉన్న చిన్నారులు 2015, ఏప్రిల్ 1- 2017, మార్చి 3 మధ్యలో జన్మించి ఉండడమే కాకుండా ఏదైన ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు ఉన్న స్కూల్‌లో మూడో తరగతి తప్పనిసరిగా పాసై ఉండాలి.

అలాగే 5వ తరగతిలో ప్రవేశానికి ఆసక్తి ఉన్న చిన్నారులు 2014 ఏప్రిల్ 1 - 2016, మార్చి 3 మధ్యలో జన్మించి ఉండడమే కాకుండా ఏదైనా ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు ఉన్న స్కూల్‌లో నాలుగో తరగతి తప్పనిసరిగా పాసై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 19వ తేదీలోగా వెబ్‌సైట్ : హెచ్‌టిటిపి://ఏపీస్పోర్ట్సుస్కూల్.ఏపీ.జీవొవి.ఇన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత జిల్లాల వారీగా జూలై ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే ఎంపికలకు ఒరిజినల్ సర్టిఫికెటతో హాజరు కావాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు జూలై 10, 11వ తేదీలలో రాష్ట్రస్థాయిలో జరిగే ఎంపికలో పాల్గొనాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ కె.వైకుంఠరావు ఫోన్: 83094 17921లోసంప్రదించాలని సూచించారు.

దేశ ప్రగతి లక్ష్యంగా మోదీ పాలన

ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : భారత్ ప్రధాని నర్రేంద మోదీ పాలనలో ప్రపంచంలో ఐదో బలమైన ఆర్థిక శక్తిగా అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు పేర్కొన్నారు. 11 ఏళ్ల ప్రధాని పాలన కొత్త పంథాలో విజయవంతంగా సాగుతోందని ప్రశంసించారు. ఆదివారం బిర్లా జంక్షన్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన '11 ఏళ్ల మోదీ ప్రభుత్వం- సంకల్ప్ సే సిది' ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మోదీ పాలన, దేశ ప్రగతి అంశాలపై మాట్లాడారు. అలాగే వైజాగ్‌లో యోగా దినోత్సవ కార్యక్రమంలో హాజరవుతున్న ప్రధానికి నగర వాసులు ఘన స్వాగతం, రికార్డు భాగస్వామ్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, కేశవకాంత్, జ్యోతి, సుహాసిని పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

40 మంది రక్తదానం

సీతమ్మధార, జూన్ 8, (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 24 వార్డు నక్కవానిపాలెం గ్రామం ఏఎంజీ ఆస్పత్రి ఎదురుగా గల భవనంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకలు రవి శంకర్ జీ 69వ జన్మదినోత్సవం సందర్భంగా పీవీ సహాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లైన్స్ ఇంటర్నేషనల్ బ్లాడ్ బ్యాంక్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో ఔత్సహికులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. సుమారు 40 మందికి పైగా రక్తదానం చేసారు.

కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ పీవీవీఎస్ మూర్తి, కార్యనిర్వాహకులు పి.శ్రీనివాసరావు, జి.శాంబమూర్తి, భత్తుల శ్రీ రంగ, డి.రమేష్, ఎం.గురునాథ్, పి.సత్యరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి

... 5వ పేజీ తరువాయి

ఆమె తాజాగా కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. గత ఏడాదిన్నరగా ఇన్‌చార్జి సూపరింటెం డెంట్‌గా డాక్టర్ శివానంద వ్యవహరిస్తున్నారు. ఇప్పటికి పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను ఆరోగ్యశాఖ నియమించింది. సోమవారం బాధ్యతలు స్వీకరించేందుకు డాక్టర్ వాణి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కేజీహెచ్ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.

విశాఖ సహకార బ్యాంకు డివిడెండ్ రూ.43.06 కోట్లు

» బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సీతమ్మధార, జూన్ 8, (ఆంధ్రజ్యోతి) : ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ 12 శాతం డివిడెండ్‌ను ప్రకటించిందని, 2024-25 సంవత్సరంలో రూ.71.77 కోట్లు మిగులును సాధించిందని, దానిలో చట్టపరంగా చేయవలసిన రిజర్వ్‌లను ఆయా ఖాతాలకు జమ చేసి మిగిలిన మొత్తం లో రూ.43.06 కోట్లను డివిడెండ్ 12 శాతంగా జమ చేయగలమని బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. జాతీయ రహదారి పక్కన మద్దిలపాలెంలో గల కాకతీయ కన్వెక్షన్ సెంటర్‌లో బ్యాంక్ 110వ మహాజన సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాఘవేంద్రరావు మాట్లాడుతూ 202-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ డిపాజిట్లలో రూ.206.64 కోట్లు పెరుగుదలతో రూ.4,354.73 కోట్లకు చేరుకుని 4.98 శాతం వృద్ధి సాధించినట్టు వెల్లడించారు. రుణాలలో రూ.238.33 కోట్ల పెరుగుదలతో రూ.3,436.47 కోట్లకు చేరుకుని 7.42 శాతం వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. బ్యాంకు నిరర్థక ఆస్తుల సంఖ్య 458 గాను, మొత్తం రూ.64..59 కోట్లు నిరర్థక ఆస్తుల శాతం 1.88కు చేరుకుందన్నారు. నికర నిరర్థిక ఆస్తులు గత ఏడాదిలో సున్నా శాతంగా ఉందన్నారు. బ్యాంకు పూర్వ అధ్యక్షుడు, మార్గ దర్శకులు మానం అంజనేయులు మాట్లాడుతూ లక్షకు పైబడి ఉన్న సభ్యులకు సహకార రంగంపై అవగాహన, శిక్షణ, విద్య అందించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని పాలకవర్గానికి సూచించారు. సంప్రదింపుల కమిటీ సభ్యులు మరింత క్రియాశీలకంగా పని చేయాలని అభిప్రాయ పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం లేనప్పటికీ మన బ్యాంక్ లాభాలు అర్జిస్తోందని తెలిపారు.

బ్యాంక్ పూర్వ జనరల్ మేనేజర్ ఏ.వి. రామకృష్ణారావు బ్యాంకుకు చేసిన సేవలను గుర్తింపుగా పాలకవర్గం ఘనంగా సన్మానించారు. వివిధ బ్రాంచీల సంప్రదింపుల కమిటీ సభ్యులు అభిప్రాయాలు, సూచనలను తెలియచేశారు.

సమావేశంలో బ్యాంకు సీఈవో వీవీబీ వరలక్ష్మి, డైరెక్టర్లు పీవీ నరసింహమూర్తి, జేవీ సత్యనారాయణ మూర్తి, బ్యాంకు ఉపాధ్యక్షులు ఎం.రాఘవరావు, డైరెక్టర్లు, బ్యాంక్ అధికారులు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ రాఘవేంద్రరావు

నేడు ఏయూ పాలక మండలి సమావేశం

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ఆఫ్‌లైన్, వర్చువల్ విధానంలో సభ్యులు పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి సభ్యులకు ఇప్పటికే సమాచారాన్ని వర్సిటీ అధికారులు అందజేశారు. ఇదిలావుండగా ప్రస్తుతం కొనసాగుతున్న పాలక మండలిపై వర్సిటీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావచ్చింది. ఇప్పటికీ ఏయూకు నూతన పాలక మండలిని ఏర్పాటు చేయలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పాలక మండలి సభ్యులతోనే సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

ఇందులో చర్చించే అంశాలు, తీసుకునే నిర్ణయాలకు సంబంధించిన సమాచారం బయటకు వెళ్లిపోయే అవకాశం ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

పల్లా సింహాచలానికి కన్నీటి వీడ్కోలు

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మేయర్ పులుసు జనార్దనరావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావుతో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

నేడు ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గల వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్లకు సోమవారం కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ర్యాంకుల వారీగా ఈ నెల 5వ తేదీ నుంచి ప్రభుత్వ పాత ఐటీఐలో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం బాలికలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు, దివ్యాంగులు, మాజీ సైనికులు తదితర కేటగిరీ అభ్యర్థులకు మధ్యాహ్నం మొదటి ర్యాంకు నుంచి 804 ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరై సీట్లు రాని అభ్యర్థులు సోమవారం హాజరుకావచ్చని శ్రీకాంత్ సూచించారు. అలాగే 10వ తేదీన 805 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

రూ.2.46 కోట్లతో మినీ ఫంక్షన్ హాలు నిర్మాణం

» కార్పొరేటర్ కవితఅప్పారావు

కంచరపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 48వ వార్డు బాపూజీనగర్‌లో సుమారు రూ.2కోట్ల 46 లక్షలతో మినీ ఫంక్షన్ హాలు నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు కార్పొరేటర్ గంకల కవితఅప్పారావు తెలిపారు. ఈ నిర్మాణ పనులను ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ కొండవాలు గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఉండే ఫంక్షన్ హాలు నిర్మాణానికి ఇప్పటికే గ్రౌండ్ లెవల్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. పేద ప్రజలు నివాసం ఉంటున్న అన్ని ప్రాంతాల్లో సామాజిక భవనాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావును ను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాపూజీ నగర్ వాసులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

... 5వ పేజీ తరువాయి

స్కోరుతో మూడో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 46) సాధించింది. అలాగే గాజువాకకు చెందిన యలవర్తి సాయి సిద్ధార్థ 86.54 స్కోరుతో నాలుగో (రాష్ట్ర స్థాయిలో 61) ర్యాంకు, సింహాచలం ప్రాంతానికి చెందిన సతి జయశృతి 86.10 స్కోరుతో ఐదో (రాష్ట్ర స్థాయిలో 70) ర్యాంకు, వేపగుంటకు చెందిన మూల వెంకట సాయికృష్ణ 84.87 స్కోరుతో ఆరు (92), మద్దిలపాలేనికి చెందిన గొట్టిపల్లి శృతిహాసిని 84.16 స్కోరుతో ఏడో (105) ర్యాంకు, గాజువాకకు చెందిన గొలగాని తేజేశ్ 82.35 స్కోరుతో ఎనిమిది (145), మాధవధారకు చెందిన చింటాడ రిషిత 81.65 స్కోరుతో తొమ్మిది (176), అక్కయ్యపాలేనికి చెందిన శొంఠి నాగలలిత శ్రావ్య 81.38 స్కోరుతో పదో ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 181) సాధించారు.

భారీగా హాజరైన విద్యార్థులు

ఏపీఈఏపీ సెట్‌కు జిల్లాకు చెందిన వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 32,026 మంది దరఖాస్తు చేసుకోగా 30,505 (95.25 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు.

వీరిలో 22,111 (72.48 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో ప్రవేశాలకు సంబంధించిన పరీక్షకు 9,137 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8,340 (91.27 శాతం) మంది హాజరయ్యారు. వీరిలో 7,411 (88.86 శాతం) మంది విద్యార్థులు అర్హత సాధించారు.


మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం

'విప్లవోద్యమాన్ని విస్తరించాలి'

డాబాగార్డెన్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అరుణోదయ సంఘాల నిర్మాణంతో పాటు విప్లవోద్యమాన్ని విస్తరించాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం పిలుపునిచ్చారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల రెండు సంస్థల విలీన సభ పురస్కరించుకుని సాహిత్య సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విప్లవ సాంస్కృతికోద్యమ నిర్మాణంలో భాగమైన క్రమంలో రెండు సంఘాలు కలవడం అవసరమన్నారు.రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కును కాపాడుకోవడంతో పాటు మందసలో ఎయిర్‌పోర్టు రాకుండా ఉద్యమించాలన్నారు. తెలంగాణ అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ కళాకారులు ప్రజా సమస్యలను తమ రూపాల్లో ప్రదర్శించాలని సూచించారు.

సీఐటీయూ మహాసభలపై సమావేశం

డాబాగార్డెన్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విధానాలు రాష్ట్ర ఆర్థిక స్వాలంబనను నాశనం చేస్తున్నాయని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు అన్నారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల ఆహ్వాన సంఘం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 లక్షల మంది సభ్యులు, 499 అనుబంధ సంఘాలు, 1300 మంది సీఐటీయూ ప్రతినిధులు మహాసభల్లో పాల్గొంటారన్నారు. ఈ సభలు డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరుగుతాయన్నారు. అనంతరం ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా సీహెచ్ నరసింగరావు, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కోశాధికారిగా నాగేశ్వరరావును నియమించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

తగరపువలస, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలాజీనగర్‌లో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజపురం మండలం కజకులపేటకు చెందిన దువ్వాపు సత్యప్రకాశ్ (31) దివీస్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన లక్ష్మీ దుర్గతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారు కొన్ని నెలలుగా బాలాజీనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రకాశ్ వైద్యుల సూచనల మేరకు విధులకు వెళ్లకుండా ఇంటి వద్ద చికిత్స తీసుకుంటున్నాడు. శనివారం ఇంట్లో కుర్చీలో నుంచి కిందపడిపోయి, నోటి నుంచి నురుగలు రావడంతో అతని భార్య ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు తెలిపారు. లక్ష్మీ దుర్గ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయండి

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ పాల్గొనున్న ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని చెప్పారు, ముఖ్యంగా వచ్చిన వారికి మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యుత్,పార్కింగ్, రవాణా, వైద్యం తదితర అంశాలపై దృష్టిసారించాలని తెలిపారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల నుంచి ప్రజలు రానున్నారని, అందుకు తగ్గట్టుగా రవాణా సదుపాయం కల్పించాలని సూచించారు, ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, డీఆర్ఓ భవానీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్


విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం, డీన్స్, ప్రిన్సిపాళ్లు

ఎంసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

డాబాగార్డెన్స్ జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈఏపీ (ఎంసెట్) పలితాల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ విభాగంలో 9,15,21,24,41,63,83,86, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 7,11,33,34, 36,41, 46, 61,91 ర్యాంకులు సాధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కేవీ రమణ తెలిపారు. ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ విభాగంలో డి. గన్నరత్విక్‌సాయి 9వ ర్యాంకు, పీహెచ్ సూర్య కార్తీక్ 15, బి.విక్రమ్‌రాజా 21, కె. రసజ్ఞ 24, జె.యోగేశ్వర్ 41, సాయిధర్మప్రతాప్ 47, ఎస్‌పీఎస్ భరత్ 63, బి. రోహిత దత్తా 83, ఆర్. కార్తీ 86వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే 10లోపు 1, 100లోపు 9, 500లోపు 46, వెయ్యిలోపు 116 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని చెప్పారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో జి. లక్ష్మీచరణ్ 8వ ర్యాంకు, ఎస్‌జేఎల్ శృతి 11, టి. మైత్రి 33, జి. కీర్తన 34, కల్యాణి 36, వై. కౌశిక్ 41, కుందేశ్వరి 46, వై. సాయిసిద్ధార్థ 61, ఎఆర్ఎస్ చంద్ర 9వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. 10లోపు 1, 100లోపు 9, 500లోపు 52, వెయ్యిలోపు 108 మంది ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థు లను ఏజీఎం రమణ, డీన్లు బంగారుబాబు,ఎస్.రఘుకుమార్, వి. వాసుబాబు, తదితరులు అభినందించారు.

ఆర్కే బీచ్‌లో ఏయూ విద్యార్థుల 'స్వచ్ఛత'

బీచ్‌రోడ్డు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ జీపీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఆర్కే బీచ్‌లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. వరల్డ్ ఓషియన్ డే పురస్కరించుకొని ఏయూ సిబ్బంది, విద్యార్థులు తీరంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు.


69వ ర్యాంకు సాధించిన తులసీ భార్గవ్‌రామ్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ మురళీకృష్ణ

ఎసెంట్ విద్యార్థుల విజయకేతనం

డాబాగార్డెన్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈఏపీ ఫలితాల్లో ఎసెంట్ మెడికల్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటరని డైరెక్టర్ ఎంవీఆర్ మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్రస్థాయిలో 69వ ర్యాంకును ఎం.తులసీ భార్గవ్‌రామ్ సాధించారన్నారు. 14 మందికి 500లోపు ర్యాంకులు వచ్చాయన్నారు.గత ఏడాది కూడా తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థుల ప్రతిభ వెనుక డైరెక్టర్లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఉన్నాయని ఆయన చెప్పారు.

నేటితో బదిలీలకు తెర

... 5వ పేజీ తరువాయి

జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఇందుకు అనుగుణంగా బదిలీకి యంత్రాంగం నిర్ణయించింది. అయితే ఏం జరిగిందో గానీ తాజాగా సదరు తహశీల్దారును బదిలీ చేయవద్దని ఒత్తిడి తెస్తున్నారని రెవెన్యూ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది. మరో తహశీల్దారును అప్రాధాన్యత గల మండలానికి పంపాలని నిర్ణయించారు. కలెక్టరేట్‌లో నాలుగు సెక్షన్లు ఉండగా ప్రస్తుతం రెండింటికీ ప పూర్తి స్థాయి సూపరింటెండెంట్లు ఉండగా, మరో రెండు ఇన్‌చార్జిలతో నడుస్తున్నాయి. రెగ్యులర్ సూపరింటెండెంట్లలో ఏవోగా ఉన్న ఈశ్వరరావు వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. అందువల్ల కలెక్టరేట్‌లోని నాలుగు సెక్షన్లకు పూర్తి స్థాయిలో సూపరింటెండెంట్లను నియమించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి సీనియర్లను తీసుకురావడం, జిల్లాలో ఉన్న డీటీలలో సీనియర్లకు అడహక్ పదోన్నతులు ఇవ్వాలని భావిస్తున్నారు. ఇదిలావుండగా జలవనరుల శాఖలో బదిలీలకు సంబంధించి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ శాఖలో బదిలీల కోసం పలువురు ఉద్యోగులు రెండు అంత కంటే ఎక్కువగా సిఫారసు లేఖలు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేసే అవకాశం ఉందని కొందరు ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

'అస్త్రం'తో ట్రాఫిక్ సమస్యలకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

పోలీసులతో పాటు ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసునేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. టెలిగ్రామ్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే నగర రోడ్లపై ట్రాఫిక్ పరిస్థితి, ఎక్కడైనా ప్రమాదం జరిగి ట్రాఫిక్ జామ్ అవ్వడం, వీఐపీలు ఎవరైనా ఉంటే ఏ రూట్‌లో ప్రయాణిస్తున్నారనేది ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ15 నిమిషాలకు సమాచారం అప్‌డేట్ అవుతుంది కాబట్టి రద్దీ మార్గాల్లో కాకుండా ప్రత్యమ్నాయమార్గాల్లో ప్రయాణించడం ద్వారా సమయం ఆదా చేసుకునేందుకు ఈ యాప్ ఉపకరిస్తుందని అనిత పేర్కొన్నారు.

సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ అస్త్రం యాప్ దేశంలో బెంగళూరు తరువాత విశాఖ నగరంలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. విజయవాడలో యాప్ ఉన్నప్పటికీ అది కేవలం పోలీసులకు మాత్రమే అందుబాటులో ఉందని, విశాఖలో మాత్రం ప్రజలకు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ యాప్‌ను ప్రతీ 15 నిమిషాలకు అప్‌డేట్ చేయడం జరుగుతుందని, తద్వారా తాజా సమాచారం వాహనదారులకు లభిస్తుందని వెల్లడించారు. ఈ యాప్ వల్ల ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి పోలీసులు తక్షణమే క్లియర్ చేసేందుకు సహకరిస్తుందన్నారు. వెబ్ అప్లికేషన్ డేటా ఆధారంగా నెలవారీ నివేదికలను రూపొందించడం, ట్రాఫిక్ రద్దీ తరచూ ఎక్కువగా ఉండే జంక్షన్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సూచనలను అందించడం వంటి అనేక ప్రయోజనాలు ఈ యాప్ ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. మరో మూడు నెలల్లో పూర్తి స్థాయిలో యాప్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని సీపీ వివరించారు. యాప్‌ను అభివృద్ధి చేసిన తిరుమలరావు, శ్రీనివాస్‌లను ఆయన అభినందించారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లను హోంమంత్రి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, అజితా వేజెండ్ల, కృష్ణపాటిల్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి కన్నీటి నివాళి

దివంగత మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. కొత్త గాజువాకలో సింహాచలం భౌతికకాయాన్ని సందర్శించడానికి తండోపతండాలుగా ప్రజలు తరలివచ్చారు. ఆయన పార్థివదేహంపై తెలుగుదేశం పార్టీ జెండా ఉంచి ఘనంగా నేతలు నివాళులర్పించారు. విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు సింహాచలం పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన కుమారుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అధికార లాంఛనాలతో సింహాచలం అంత్యక్రియలను నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే సింహాచలం మృతికి సంతాపం

పెదగంట్యాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. జీవీఎంసీ 65, 75, 76 వార్డుల కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, పులి లక్ష్మీబాయి, గంధం శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణా రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, 75వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, స్టీల్‌ప్లాంట్ ఇంటక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.వంశీకృష్ణ, స్టీల్‌ప్లాంట్ బీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీముసురు శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు.

అంత్యక్రియలకు తరలిన నేతలు

కూర్మన్నపాలెం: మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం అంత్యక్రియలకు తెలుగుదేశం పార్టీ నాయకులు తరలివెళ్లారు. 87 వార్డు కార్పొరేటర్ బొండా జగన్, 86 వార్డు నేత నల్లూరు సూర్యనారాయణ, ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు సింహాచలం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే పలువురు నాయకులు, సంస్థల ప్రతినిధులు తలశిలబల రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, విష్ణువర్థన్, పప్పు రాజారావు, గొర్లె వెంకునాయుడు, ఎస్ఎస్ విజయరామరాజు, చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, పీఎంఎల్ నాయుడు, ఉరుకూటి శ్రీను తదితరులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పరామర్శించారు.

నేడు క్యాన్సర్ వ్యాక్సిన్ శిబిరం

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లల కోసం ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాలులో సోమవారం క్యాన్సర్ వ్యాక్సిన్ శిబిరం జరుగనుంది. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆరు నెలల క్రితం జర్నలిస్టుల కుమార్తెలకు మొదటి డోస్ వేయగా, రెండో డోసు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ వేయనుంది. ఉదయం 9.00 గంటలకు ఈ శిబిరం ప్రారంభం కానుందని, జర్నలిస్టుల కుమార్తెలు ఆధార్ కార్డులు తీసుకొని హాజరుకావాలని ఫెడరేషన్ విశాఖ శాఖ అధ్యక్షుడు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

ఉడా నగర్-1 పార్కుకు బెంచీల వితరణ

కూర్మన్నపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86 వార్డు ఉడా నగర్-1 పార్కులో స్పందన చేయూత స్వచ్ఛంద సంస్థ నాలుగు సిమెంట్ బెంచీలను అందించింది. పార్కుకు విచ్చేసిన వారు సేద తీరేందుకు ఈ బెంచీలు దోహదపడతాయని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్, స్పందన చేయూత ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు(తెలుపు)20, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 35 దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)52, బరబాటి 30,ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్ది) 24, బీన్స్ (పెన్సిల్) 130, కీరదోస 38, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు(కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన(కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు20, కర్ర పెండలం18, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు బ్రాయిలర్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

ఉత్సాహంగా అంధ మహిళల అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు

మొదటి రోజు విజేతలు ఆంధ్రా, ఒడిశా జట్లు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉక్కు స్టేడియంలో అంతర్రాష్ట్ర అంధ మహిళల క్రికెట్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ సంస్థ సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ కేరళ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ప్రారంభ కార్యక్రమంలో విజువల్లీ ఛాలెంజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు ప్రసంగించారు. ఈసారి పోటీలు విశాఖలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అంధులు క్రికెట్ ఎలా ఆడుతారని, వారికి ఆటలెందుకన్న వారికి ఇదో ఉదాహరణ అన్నారు. అంధులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వీరిని ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. దృష్టి లోపం ఉన్న వారు ఆటల్లో పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. దృష్టి లోపం ఉన్న వారికి అన్ని విధాలా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాది శరత్‌బాబు, ఎన్టీపీసీ అధికారి అనిత్, ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డి, పోటీల కోఆర్డినేటర్ అమ్మినాయుడు, నరేశ్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రబాబు... క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

తొలి రోజు ఫలితాలు...

మొదటి రోజు ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల జట్ల మధ్య జరిగిన పోటీలో తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు నిర్దేశిత 15 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 185 పరుగులు చేయగా, కేరళ జట్టు 79 పరుగులు చేసి పరాజయం పాలైంది. అలాగే ఢిల్లీ, ఒడిశా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు 15 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 126 పరుగులు చేయగా, ఢిల్లీ జట్టు 14.5 ఓవర్లలో కేవలం 77 పరుగులు మాత్రమే చేసి పరాజయం చెందింది.

కదంతొక్కిన ఉపాధ్యాయులు

జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ముట్టడి

ఎస్జీటీ కౌన్సెలింగ్ మాన్యువల్‌గా చేపట్టాలని డిమాండ్

ఆరిలోవ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వందలాది మంది ఉపాధ్యాయులు చేరుకొని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో 'వెబ్ కౌన్సెలింగ్ వద్దు - మాన్యువల్ కౌన్సెలింగ్ మాత్రం ముద్దు' అనే నినాదంతో డీఈవో కార్యాలయం ఆవరణ మార్మోగింది. ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ మాత్రమే చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి విరుద్ధంగా ఇతర ప్రత్యామ్నాయ విధానాలు వద్దని కోరారు. గతంలో ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరిపి తీరాలని పట్టుపట్టారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. వెబ్ కౌన్సెలింగ్‌లో వందల కొద్దీ ఆప్షన్లను ఎంచుకోవాలని, ఇది కష్టతరంగా ఉంటుందన్నారు. కాబట్టి అధికారులు తమ ఆవేదనను అర్థం చేసుకొని మాన్యువల్ విధానంలోనే కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించకుండా అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాల విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుల సంఘాల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం అనంతరం ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్జేడీ) కె.విజయభాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం ముట్టడి నేపథ్యంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరారవు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.గోపీనాథ్ (పీఆర్టీయూ) ఇమంది పైడి రాజు (ఎస్టీయూ) టి.చిన్నబాబు (యూటీఎఫ్,) టి.రామకృష్ణా రావు (ఏపీటీఎఫ్), అరుణ్‌కుమార్, వీరభద్రరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల రిలే నిరాహార దీక్ష

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి వెబ్ ఆప్షన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేయనున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉపాధ్యాయ ఐక్య సంఘాల వేదిక పిలుపునిచ్చింది.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో శ్రమదానం

కూర్మన్నపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. రైలు పట్టాలపై ఉన్న ప్లాస్టిక్ వస్తువులను ఏరి ఓ చోట బస్తాలలో నింపారు. వీటిని జీవీఎంసీకి అందించారు. ఈ సందర్భంగా జడ్ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాషువా, పలు సంస్థల నిర్వాహకులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల ప్రతి ఏటా రెండు మిలియన్ల పక్షులు, సముద్ర జీవులు అంతరించిపోతున్నాయని వాపోయారు. దువ్వాడ రైల్వే స్టేషన్ పరిసరాలను రైల్వే ఉన్నతాధికారుల అనుమతితో పరిశుభ్రం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన చేయూత ఫౌండేషన్, మానవ వికాస వేదిక, సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రయాణికులకు మినరల్ వాటర్ సీసాలు అందించారు.



రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రం చేస్తున్న దృశ్యం... సేకరించిన ప్లాస్టిక్ వస్తువులు

97వ వార్డులో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

పెందుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని 97వ వార్డులో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని కార్పొరేటర్ సేనాపతి వసంత చెప్పారు. గిరిప్రసాద్‌నగర్-1లో రూ.33 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు, రహదారి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వసంత మాట్లాడుతూ శంకుస్థాపనలతో సరిపెట్టకుండా వార్డులో అభివృద్ధి పనులకు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత శంకరరావు పాల్గొన్నారు

ఎర్రగెడ్డ కాలనీలో లక్ష్మీగణపతి సంబరాలు

ఆటోనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధిలోని ఎర్ర గెడ్డకాలనీలో లక్ష్మీగణపతిస్వామి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ ధర్మకర్త బొడ్డేడ రమణ పర్యవేక్షణలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, గరిక పూజలు, హోమాలు జరిగాయి. పూలదండలు, విద్యుత్ దీపాలు, మామిడి, అరటి తోరణాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువ జామునే ఆలయానికి చేరుకుని లక్ష్మీగణపతిస్వామిని దర్శించుకున్నారు. కోలాటాలు, సాము గరిడీలు, చిటికెల డ్యాన్సులు, మందుగుండు సామగ్రి పేలుళ్ల, సన్నాయి మేళం, తదితర సాంస్కృతిక కార్యక్రమాల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధులలో కన్నులపండువగా ఊరేగించారు. ఈ సంబరాల్లో ఆలయ కమిటీ సభ్యులు కేవీఎస్.శంకరరావు, రాపేటి గోవింద, ఎమ్ఎస్ఎన్.రాజు, పీఎమ్ఎల్.నాయుడు, రాపేటి నాగేశ్వరరావు, సూర్యనారాయణరాజు, వి.నూకరాజు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీగణపతిస్వామి

సముద్ర కెరటాలకు ఉక్కు ఉద్యోగి బలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సముద్ర కెరటం బలంగా తాకడంతో ఉక్కు ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన అప్పికొండ బీచ్‌లో ఆదివారం జరిగింది. ఇస్లాంపేట ప్రాంతానికి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఎండీ.దావుద్ (45) ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అప్పికొండ బీచ్‌కు వెళ్లారు. సముద్ర తీరంలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా కెరటం బలంగా తాకడంతో దావుద్ వెనక్కి పడిపోయాడు. దీంతో స్పృహ కోల్పోయిన దావుద్‌ను హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దావుద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎండీ.దావుద్ (ఫైల్ ఫొటో)

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: తహసీల్దార్ శ్రీవల్లి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి చెప్పారు. జిల్లా ఆయుష్ విభాగం, బెల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ హెచ్‌పీవీపీ క్రీడా మైదానంలో నిర్వహించిన యోగా అవగాహన శిబిరంలో ఆమె మాట్లాడారు. మానసిక ప్రశాంత యోగాతోనే సాధ్యమన్నారు. అనంతరం మింది ప్రభుత్వ హోమియో వైద్యాధికారి ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ యోగాతో అనేక దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చన్నారు. ప్రముఖ యోగా శిక్షకులు డాక్టర్ పసుపులేటి లక్ష్మణ్, కె.తేజా బాస్కర్‌రావు, జి.అఖిల్ సూర్య, డాక్టర్ జి.హరికృష్ణ శిబిరానికి వచ్చిన వారితో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వురుకూటి బాబురావు, నేమాని సింహచలం పాల్గొన్నారు.



యోగా ఆవశ్యకతను వివరిస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోపాలపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరై ప్రసంగించారు. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన వేలాది మంది విద్యార్థులు విభిన్న రంగాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. పాఠశాల అభివృద్ధికి వారంతా సహాయ సహకారాలు అందించి, రాబోయే తరాల విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సినీ గేయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న పూర్వ విద్యార్థి బోడ మల్లికార్జున్ గేయాలు ఆలపించి మిత్రులను అలరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ముగిసిన సీఏఎస్ఏ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇండోర్ జిమ్నాజియం హాలులో సీఏఎస్ఏ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లలో పురుషులు, మహిళల విభాగాలలో షట్లర్లు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. పురుషుల సింగిల్స్‌లో భరత్, డబుల్స్ విభాగంలో భరత్-గౌతమ్, మహిళల సింగిల్స్‌లో ప్రీతికదాస్, డబుల్స్‌లో విష్ణుప్రియ-పూజిత, మిక్స్‌డ్ సింగిల్స్‌లో విష్ణుప్రియ, డబుల్స్‌లో విష్ణుప్రియ-సాయి పృథ్వీ విజేతలుగా నిలిచారు.



ముగింపు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఉక్కు ఉద్యోగి శ్రీనివాస్ 55వ సారి రక్తదానం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): 'రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి' అనే నినాదాన్ని ప్రకటనలకే పరిమితం చేయకుండా 55వ సారి రక్తదానం చేసి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నాడు ఉక్కు ఉద్యోగి కర్రి శ్రీనివాస్. అమలాపురానికి చెందిన పి.దుర్గానారాయణ (32)కు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం అత్యవసరంగా అరుదైన ఒ నెగిటివ్ రక్తం కావాల్సి వచ్చింది. ఈ విషయం సత్యసాయి సేవా సంస్థల సభ్యుడిగా కర్రి శ్రీనివాస్‌కు తెలిసింది. ఇప్పటికే 54 సార్లు రక్తదానం చేసిన శ్రీనివాస్, ఆదివారం మరోసారి రక్తదానం చేసి యువకుడి ఆపరేషన్‌కు తనవంతు సాయం అందించారు.



కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న కర్రి శ్రీనివాస్

శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రిని ఉచితంగా నడపాలి

మల్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రిని ఉచితంగా నడపాలని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని చాలా మంది పేదలకు ఇప్పటివరకు ఆస్పత్రిలో ఉచితంగా సేవలు అందుతున్నాయని, కోరమాండల్ కంపెనీ యజమాన్యం సాధారణ రుసుం తీసుకుని ఆస్పత్రిని నడుపుతామని జీవీఎంసీకి నివేదించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత కార్పొరేటర్లంతా ఆస్పత్రిని ఉచితంగా నడపాలనే డిమాండ్‌తోనే ఉన్నారన్నారు. అందువల్ల జీవీఎంసీ ఉన్నతాధికారులు, కోరమాండల్ కంపెనీ అధికారులు పునరాలోచించి ఆస్పత్రిని ఉచితంగా నడిపే విధంగా చూడాలని ఆయన కోరారు.

ఎంసెట్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

గాజువాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్ ఫలితాల్లో గాజువాక జోన్ శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రమణ ఒక ప్రకటనలో తెలిపారు. గురు కీర్తన 34వ ర్యాంకు, కాండ్రేగుల గ్రీష్మిక 274వ ర్యాంకు, బగడి భార్గవ్ 300వ ర్యాంకు, రుత్తల వంశీకృష్ణ 307, కె.రుతుజశ్రీ 349వ ర్యాంకు, సంబంగి హేమహవిల్ 349వ ర్యాంకు, వియ్యపు జయశ్రీ 386వ ర్యాంకులతో పాటు మరి కొంత మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని చెప్పారు. వీరిని డీన్ రఘుకుమార్, కె.బంగారుబాబు, ఏజీఎం పి.శ్రీనివాసరావు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్‌కు 13 మంది విద్యార్థుల ఎంపిక

మల్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ రీక్షలో ప్రతిభ కనబరిచారు. 13 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించారు. నగర పరిధిలో ఉన్న జీవీఎంసీ పాఠశాలల్లో ప్రథమంగా, జిల్లాలో ద్వితీయ స్థానంలో పాఠశాల విద్యార్థులు నిలిచినట్టు ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి తెలిపారు. విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నిరుపేదలకు చీరల పంపిణీ

మల్కాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు బి.నాగభూషణం మాట్లాడుతూ దాదాపు 400 మంది మహిళలకు అమ్మవారి మొక్కుబడి చీరలను అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సత్యాల మహేశ్, ఉరుకూటి బాబూరావు, పట్నాల పెంటారావు, ఎల్లేటి గోవిందరాజు, మజ్జి రమేశ్, వి.చిన్నారావు, బాబ్జీ, వి.మహేశ్, పి.అప్పారావు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన

పెందుర్తి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు లక్ష్మీపురం బీసీ కాలనీలోని రామాలయం వద్ద ఆదివారం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీరామ నామస్మరణ చేశారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సిహెచ్.అప్పలనాయుడు, రమణ, అప్పలరాజు, మాతయ్య, ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళా ప్రదర్శన

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని ఎన్.ఎ.డి. సుబ్రహ్మణ్యస్వామి గుడి ఎదురుగా హమియా భవన్ కల్యాణ మండపంలో రాష్ట్ర హ్యాండులూమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేనేత హస్తకళా ప్రదర్శనను ప్రారంభించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు వైటీఆర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కళాకారులు నేచిన దుస్తులను అందరూ ధరించాలని కోరారు. నిర్వాహకుడు జి.నరేశ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జరిగే ఈ ప్రదర్శనను అందరూ తిలకించాలని చేనేతదారులకు చేయూతనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు పాల్గొన్నారు.

రథాలమ్మ జాతర కరపత్రాల ఆవిష్కరణ

ఆటోనగర్,జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు కణితి కాలనీలోని కాళింగుల ఆరాధ్య దేవత రథాలమ్మతల్లి జాతర ఈ నెల 14 నుంచి నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం జాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 24వ తేదీన అమ్మవారి అనుపోత్సవం జరుగుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే నెమలి, బిందెలు, కేరళ బ్యాండ్ డాన్సులు, తప్పెటగుళ్ళ, తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.